# కామాక్షమ్మ

శ్రీ భమిడిపాటి వెంకటరమణ

★

కామాక్షమ్మ పేరు వింటే నా గుండె గడగడలాడుతుంది. ఆడది సాహసిస్తే ఎంత పనయినా చెయ్యగల్గుతుంది.

ఆడదాని అసూయాన్ని ముందు పురుషుని ప్రతాపం గడ్డిపోచకున్న పనికిమాలినిది. నా సంగతికూడా అంతే అయింది: కామాక్షమ్మ క్రోధాగ్నిలో పూర్తిగా నేనూ నా భార్య, రెండుకాలలయినా నిండని నాబిడ్డ ఏడాదయినా పూర్తిగాని మా కొత్త సంసారము, కొత్తగాకొనుక్కున్న గిన్నెముంతా, కట్టుబట్టలూ, బంగారం— సమస్తంతో ఆ అగ్నిలో పడి తగలబడేవారమే కాని. ఏకొంచెమో అదృష్టం ఉండబట్టి మాగింజలు ఇంకా ఈ నేలమీద మిగిలి ఉన్నాయి కాబట్టి ఆగండం గడచి బయటపడ్డాం. చావు తప్పి కన్ను లొట్టపోయినట్లు మా సమస్తమూ ఆదేవి ఈర్ష్యాగ్నికి ఆహుతి చేసి మేము తనువులతో మిగిలాము. బ్రతికాము.

ఉన్నట్టుండి పదిరోజులలో ఇల్లు ఖాళీ చేయమని కబురుపెట్టాడు. అప్పుడు మేము ఉంటున్న యింటియజమాని. తను తన భార్యా పిల్లలతో వచ్చి అక్కడ ఉండేందుకు నిశ్చయించాడుట ఆయన. అడిగిన వెంటనే ఇల్లు ఇచ్చి, ఇన్నాళ్లు ఉండనిచ్చి, అద్దెకోసం బాధపెట్టక, నేను ఎప్పుడు ఇస్తే అప్పుడు ఎంత యిస్తే అంత పుచ్చుకొని అత్యంత సహాయకారి అయిన యింటియజమాని మాట ఎలాగ కాదని అక్కడే నిలవద్రొక్కుకుని ఉండగలను? ఆయిల్లు తనకు చాలకపోయినా, పట్నంలో తనకు సరిపోయే ఇల్లు వేరే దొరకని కారణం చేత చిన్నదయినా ఊరుచివర్ని ఉన్నప్పటికీ తనయింటికే చేరకోవలసిన అవసరం తప్పిందికాదు ఆయనకి.

తాత్కాలికంగా రెండు గడ్డికాలలు కట్టించి కాలక్షేపం చేస్తూ క్రమంగా ఇల్లు అభివృద్ధి పరుచుకోవాలని ఆయన సంకల్పం తప్పదు. 10 వ తేదీనాటికి ఇల్లు ఖాళీచేసి వేరే ఇంటికి మారక తప్పదు. అయితే ఇంతవేగం ఇల్లెక్కడ దొరుకుతుంది? ఆయనకి మాట ఇచ్చాను. 10 వ తేదీ సాయంకాలానికల్లా మీ ఇల్లు ఖాళీచేసి మీరు వచ్చిదిగేందుకు సిద్ధంగా వుంచుతానని.

ఎక్కడయినా రెండుగదులుండేభాగం దొరుకుతే చాలు. ఏ ఇంటికయినా ఇచ్చే అద్దె దానికికూడా ఇచ్చి ఉండవచ్చు. ప్రస్తుతానికి మళ్లీ మంచిఇల్లు దొరికేవరకు. ఆత్రుతిగా వీధులన్నీ తిరుగుతున్నాను. ఏఇల్లు చూసినా రెండుకూడిళ్ళకు సరిపోయే మనుష్యులతో నిండివుండేగానీ ఏ యింటిలోనూ మరొకమనిషి నిలుమందుకి చోటులేదు.

10 వ తారీఖు వచ్చింది. ఈ సాయంకాలానికి ఇల్లు ఖాళీచేసి ఉండకపోతే ఇంటి యజమానితో నాకు జగడం తప్పదు. ఆయన ఇన్నాళ్ళుగా చూపుతూవచ్చిన ఔదార్యం ఇవాళ ఆగ్రహంగా మారక తప్పదు. నేను మాటతప్పినవాణ్ణే గాకుండా మర్యాద పోగొట్టుకున్నవాణ్ణి కూడా అవుతాను. ఈ సాయంకాలంలోపుగా ఇల్లు దొరికితే నేను ధన్యుణ్ణి.

ఆవీధిమలుపు తిరిగానో లేదో రెండు మూడిళ్లు దాటగానే మేడఇల్లు వీధితలుపు తెరుచుకొని గుమ్మంలో కామాక్షమ్మ నిలబడివుంది. కామాక్షమ్మగురించి ఇదివరకు విన్నాను. ఆడవాళ్లలో లెక్కపెట్టినలసినదని. ఆమె స్వంతప్రయోజకత్వంవల్ల భూమి, పుట్రా కొని ఇల్లూవాకిలీ కట్టిందని ఏదో పాతికవేలఆస్తి సంపాదించిందనీ. ఆవిడ అనుగ్రహిస్తే మనకష్టం గట్టెక్కకపోదు.

"ఏమండీ మీ యింట్లో అద్దెకివ్వడానికి ఏవయినా భాగాలు ఖాళీగా ఉన్నాయా?" అని ఆమెను నిండు ఆశతో ప్రశ్నించాను. నా ఆశ ఫలించింది.

"రా నాయనా, లోపల కొంత భాగం ఖాళీగానే ఉంది. మీకు సరిపోతుందేమో చూసుకుందువుగాని?" అని దగ్గరుండి నాకు ఇల్లంతా చూపించింది ఆవిడ. మాకయితే రెండుగదులు చాలు. కాని మేము కామాక్షమ్మ ఇంటివెనకకి ఉండాలి. రోడ్డుమీదకి మా యిల్లు లేకపోవడం చాలా చింతించవలసిన విషయమే అయినా ఆ పరిస్థితుల్లో నాకు ఆలోచించేందుకు వ్యవధి లేదు. సాయంకాలానికల్లా మా సామానుతో మేము దిగిపోతున్నాం. ఈలోగా మీరు ఇల్లు బాగుచేయించి సిద్ధంగా ఉంచండి. అని ఆమెకు మాట ఇచ్చేశాను. నా సమస్య ఇంత సుళువుగా తీరిపోయినందుకు నాకు చాలా సంతోషమయింది. కామాక్షమ్మ నాపాలిట నిజంగా దేవతవలె అవతరించిందనిపించింది. కాని నా ఊహ కేవలం పొరపాటు. నాకు చిక్కులు ఎక్కువయాయి. నిజంగా జీవనమరణసమస్య వచ్చి పడింది. కామాక్షమ్మ నాపాలిట కాళికావతారము అయిపోయింది.

మేము సాయంకాలం సామానలతో వచ్చి దిగేసరికి మాకు మొదట ఇస్తానన్న ఇల్లు మారిపోయింది. పెరట్లో ఇంకా వెనకగా ఉండే భాగంలో రెండుగదులు మా కోసం శుభ్రపరచి సిద్ధంగా ఉంచానని చూపింది కామాక్షమ్మ. ఆ గదులు మరుగుదొడ్లకి బాగా దగ్గర. ఆపక్కనే నుయ్యి. పదిమందిఆ వాడుకునేందుకి అదే నుయ్యి. మేము కి గదులలోకి వెళ్లడానికి రావడానికి పెరటి ద్వారమే శరణ్యం. దొడ్డి బాగుచేసేది వెళ్ళడానికి పశువులు వెళ్లడానికి కూడా అదే మార్గం.

ఆ పెరటి చివరిభాగంలో కూడా మాకు ఇరుగుపొరుగులు లేకపోలేదు. మరుగుదొడ్లకి తగిలి కట్టబడిన కొట్లలో కొందరు కులం చెడ్డవాళ్లు, కాపురాలు చేస్తున్నారు. కామాక్షమ్మ చాల ఉదారస్వభావురాలు. తనదొడ్లోనే కొట్లు కట్టి ఆ కులహీనులకి ఆశ్రయం ఇచ్చింది. అందుకని ఆవిడ వాళ్లదగ్గర పదేసిరూపాయలకన్న అధికం తీసుకోదు. ఈ విషయమై పైవాళ్లకి ఎంత తెలియ

కుండావుంటే అంత మంచిది. ఆ సంగతి తెలిసినందువల్ల తనకి పన్నులు అధికం అవుతాయనే విచారం కామాక్షమ్మకు లేదుగానీ ప్రజలు తన దాతృత్వాన్నిగురించి ప్రశంసించటం ఆమెకు ఇష్టంలేదు.

కామాక్షమ్మధర్మసంకటాల మాట ఎలాగున్నా నాకుమాత్రం ప్రాణసంకటం వచ్చిపడింది. నా చుట్టూ మరుగునొడ్లూ పశువుల శాలలూ, కులటల కొట్లూ దుర్గంధం. వీటికితోడు కామాక్షమ్మ మా పాటగదినే తనకు దొడ్డికి పోవడానికి దారిగా చేసుకుంది. అదీగాక ఆవిడకు బుద్ధిపుట్టినప్పుడల్లా మాయింటిమీద వచ్చి కూచునేది. ఎప్పుడూ ఏదో తన వ్యవహారము, వ్యాపార విషయాలు మాటాడుతుంది. నన్ను తన ఏజంటుగా పనిచేయమంటుంది. చాలా లాభకరంగా వుంటుందని చెప్తుంది. ఆవిడ చెప్పిన మాటలు వింటేనేనాకు మనస్సు బాధిస్తుంది. నన్నీ నరకంమధ్యనుండి తప్పించమని నేను భగవంతుణ్ణి ప్రార్థించవలసివచ్చింది.

మేము ఉంటున్నది నరకం అన్న సంగతి మాకు మరికొంతరోజులు పోగానే స్పష్టమయింది. నేను చాలా శోచనీయమైన స్థితిలో పడ్డాను. కామాక్షమ్మ క్రూరకర్కశమైన అధికారహస్తం మామీదకూడ ప్రయోగిస్తూంది మమ్మల్నికూడా ఆ కులహీనులతోపాటుగానే సంబోధిస్తూ ఉండేది.

మాతో తన శక్తిసామర్థ్యాన్నిగురించి అప్పుడప్పుడు ముచ్చటిస్తూ తనకు తెలిసి ప్రవర్తించమనేలా బెదిరించేది.

పిల్లల్ని కొందర్ని కన్నది కామాక్షమ్మ. భర్తకూడా ఉన్నాడు. అయితే అసలే ఒకకాలు విరిగిన భర్తను మరోకాలుకూడ విరిచేసి ఒకమూల కూర్చుండబెట్టింది. అంతేకాదు; అతనిహృదయాన్ని కూడా తనపిడికిట్లో బిగించి పట్టి తన ఇష్టంవచ్చినట్లలా ఆయన్ని ఆడిస్తూంది. కామాక్షమ్మ స్వబుద్ధి ప్రయోజకత్వం విలువలు నేను నిర్ణయించలేను. వయస్సువచ్చిన తన కూతుర్ని పొరుగునే తనయింట అద్దెకుంటున్న కాలేజీకుర్రాడి చేతిల్లో పెట్టేసింది. రాబోయే అల్లుడికి చెయ్యబోయే ఆదరణకు చిహ్నంగా తను కూడా వాడిగదిలో ఉంటూ తన కాఫీలు ఫలహారాలు అక్కడే గడుపుకునేది. ఇంట్లో మిరపకాయకూడా మాడ్చవలసిన అవసరం రానిచ్చేది కాదు కామాక్షమ్మ. ఈ సూత్రాన్నే కొంతవరకు మా క్షేమాన్ని కూడా అభిలషించి మా ఆవిడకు ఉపదేశం చేసింది. రోజూ కూరలకని, ఫలహారాలకని అంతడబ్బు ఖర్చు చెయ్యకూడదు. అంత డబ్బూ తిండికిందే ఖర్చుపెడితే మీరు మళేం ఇల్లు వాకిలి చేసుకుంటారు. అని బోధపరిచేది కాని మాకీ ఉపదేశాలు పని చేయలేదు. మేము బ్రతకడంకోసం తిండితింటూ పరుల్ని భక్షిస్తూ పొట్టలు నింపుకునే విద్యలో ప్రవీణులం కాలేము. ఆవిడగారిమాటలు మామీద పనిచెయ్యకపోవడం చూచి కామాక్షమ్మ మామీదకోపం వహించింది. కామాక్షమ్మ మాశ్రేయస్సుని ఎన్నోసార్లు ఉపదేశాలు ఇస్తూ మాకు తన అభయహస్తం చూపుతూ వుండేది. కాని మాకు ఆ మనిద్రలో ముందుముందు ఏదో మహావిపత్తు ఎదుర్కొనవలసి వుంటుందని భయమేసేది. ఎంతత్వరగా వీలయితే అంతత్వరగా కామాక్షమ్మ కరుణాకటాక్షవీక్షణాల్నుండి తప్పించుకొనిపోతే హాయిగా బ్రతకవచ్చుననిపించింది మాకు.

ఒకమారు కామాక్షమ్మ చేతుల్లో పడ్డవారు మళ్లీ ఆపట్టు వదలించుకొని బయటపడడం ఎంత కష్టమో నాకు ఇప్పుడిప్పుడు బోధపడింది. మేము ఆపట్టు తప్పించుకోవాలని ఎంతగట్టిగా ప్రయత్నం చేస్తున్నామో మమ్మల్ని కట్టివుంచడానికి ఆమె అంతగట్టిగా పిడికిలి బిగిస్తూంది.

సాయంత్రం ఆఫీసునుంచి ఇంటికి రాగానే మా ఆవిడ మార్గశిర లక్ష్మీవారం



నాకు కట్టుకున్న కొత్త చీర కనబడడంలేదని రిపోర్టు చేసింది. చీర మాయింటికి కామాక్షమ్మ ఇంటికి మధ్యనున్న పోట్లపందిరమీద ఆరవేసినది. సాయంకాలంవరకూ అక్కడే ఉంది సాయంకాలం కాగానే మాయమయినది. చీరకొత్తదికాకపోతే చింతలేకపోయేది.

కాని కొనుక్కొని మూడురోజులయినా కాలేదు. అందులో మాఆవిడకు అత్యంత ప్రీతిపాత్రమైనది ఆచీర. సాయంకాలం ఇంట్లో పనులేవో చక్కబెట్టుకొని పందిరమీదనున్న చీర తీసుకుందామని ఆవిడ వచ్చేసరికి చీరలేదు. ఈమాట కామాక్షమ్మతో చెప్పింది. కామాక్షమ్మ తన ఆశ్చర్యాన్నంతటినీ ప్రకటిస్తూ 'ఏమయింది?' అని అడిగింది.

ఇరుగుపొరుగుల బీదకుటుంబాలవాళ్లని పోయినచీరసంగతి ప్రశ్నిస్తూ వాళ్లని నిందాపూర్వకంగా తిట్టింది. వాళ్లని కొద్దిగా కించపరచింది. వాళ్లు మా ఆవిడఅజాగ్రత్త కారణంగా తమకు నింద వచ్చినందుకు మామీద కళ్లు ఎర్ర చేస్తున్నారు.

"కామాక్షమ్మ అనుమతి లేకుండా ఈ ఇంట్లో పురుగయినా ప్రవేశించలేదు; ఆవిడకు తెలియకుండా పూచికపుల్లయినా పోలేదుదీని అంతేమిటో కనుక్కుందా"మని నేను స్వయంగా బయలుదేరి వెళ్లాను. నా ధోరణి కనిపెట్టి కామాక్షమ్మ అవసరానికి పనికొచ్చే ఆయుధంలా తనభర్తను నామీద తోలింది. ఆయన చాలా జాగ్రత్తగా జరిగిన సంగతంతా విని, తను మధ్యవర్తిగా కామాక్షమ్మతో చేస్తున్న కాపురం; వెలిగిస్తున్న మాస్టరుగిరి ఈరెండిటి అనుభవాన్ని ఉపయోగిస్తూ సమాధానంఇచ్చాడు.

"మీరు చిన్నవాళ్లు; తొందరపడి ఏమాట అనేసినా మేము తొందరపడకూడదు. ఎప్పుడయినా మేము మీ శ్రేయస్సును కోరేవారమే కాని మీకు కష్టం కల్గించే వాళ్లము కాము. ఎందుకయినా మంచిది. మీరు మీ వస్తువుల్ని ఇంతకన్న జాగ్రత్తగా ఉంచుకోవడం మేలు" అని తీర్పుచెప్పాడు. కామాక్షమ్మకు తనకరుణా స్వభావమే ఆవిణ్ణి అప్పుడప్పుడు ముప్పు తెచ్చిపెట్టుందని మళ్లీ అలవాటుప్రకారంగా మందలించాడు.

ఈ సంఘటన ఇంతటితో ఆగితే నాకు సంతోషమయ్యేది. పోయినచీరగురించి విచారించడం ప్రయోజనం లేనిపని.

కాని అది అంతటితో ఆగలేదు.

కామాక్షమ్మ ఈ అవకాశాన్ని తీసుకొని మరొక్క దెబ్బ మామీద తియ్యాలనుకుంది కానీ అదికూడా నిష్ప్రయోజనం అయిందనగానే ఆవిడకు మేము నిజంగా శత్రువులమయిపోయాం.

"అసలు చీర పోనూలేదు, ఏమీ లేదు. నా పెరట్లోకి చీమయినా రాగలదా, ఎప్పుడయినా నా యింట్లో పూచికపుల్లయినా పోవడం మీ రెరుగుదురా? ఆ అమ్మాయి అలాగ ఎత్తువేసింది. రోజూ తింటున్న చిరుతిళ్లకి దుకాణంవాడికి డబ్బు ఇవ్వాలి. ఆయన్నడిగితే కోప్పడుతాడు. అందుకని ఆచీర అమ్మింది. లేకపోతే అంతవరకూ పందిరినున్న చీర అంతలో అంతర్ధానమవుతుందా? ఆశ్చర్యంగానీ!' అని ఇరుగుపొరుగుల ఇళ్లలో ప్రచారం చెయ్యడం ప్రారంభించింది. కామాక్షమ్మతోమాట మా ఆవిడ చెవిని పడింది.

"వెంటనే ఇల్లు మార్చడమో లేకుంటే తనకు ఆత్మహత్య చేసుకుందికి ఉపాయం చెప్పడమో ఏదో ఒకటి నిర్ణయించండి" అంది మా ఆవిడ.

నాకు తెలుసు మా ఆవిడస్వభావం. ఇతరులు నా భార్యగురించి చెప్పగా వినవలసిన అవసరం నాకు లేదు.

"ఇల్లు మార్చడమే నిశ్చయం" అన్నాను. అపారుగునే రోడ్డుమీదకి ఉన్న ఇంట్లో అంతవరకు హాస్పిటల్ పనిమీద వచ్చివున్న కోమట్లు ఆ ఉదయమే ఇల్లు ఖాళీచేసి వెళ్లారని సంగతి తెలిసింది. వెంటనే వెళ్లి ఇంటి యజమానిని తాళం అడిగి పట్టుకొచ్చాను. కాని వెంటనే ఇల్లు మార్చడానికి కామాక్షమ్మ అనుమతి ఇవ్వలేదు. నెలాఖరు వరకు ఉంది. నెల అద్దె పూర్తిగా చెల్లించి వెళ్లిపోవడం ఉభయులకూ శ్రేయస్కరం అంది కాని కామాక్షమ్మ మా శ్రేయంకోరి చెప్పిన మాటలు కావు అవి. వాటికి చాలా అర్థముంది. తన గూటిలో చేరిన పిట్టలు చూస్తుండగా ఎగిరిపోవడం కామాక్షమ్మకు కష్టకారణం. తన ఆదాయంలో పదియాపాయలు తగ్గిపోవడం ఆమెకు నిరుత్సాహకారణం. ఈరెండిటికీ కారణమయిన మమ్మ ఆవిడ సాధారణంగా క్షమించదలచుకోలేదు.

"నాయింటికన్న అది మంచిఇల్లా? అలాగే పోని కరీ ఏమయినా వేస్తూ ఉంటే మంచిది. ఎవరు తీసుకొన్న గోతిలో వాళ్లే పడకుండా చూచుకోవాలి" అని నేను లేనప్పుడు మా ఆవిడతో వెక్కిరించి పోయింది కామాక్షమ్మ.

ఆమర్నాడు మంగళవారమవుతోంది, చవితి తిథి, దుర్ముహూర్తాలు ఉంటాయి. ఇల్లు మార్చక విధి లేదు అని పట్టు బట్టింది మా ఆవిడ. ఇల్లు మార్చాం. కాని ఏం ప్రయోజనం? పూర్వంకన్న అశాంతి రేగింది. కొత్త యింట్లో నుయ్యిలేదు. నీళ్లుపోయించుకోవాలి. కామాక్షమ్మనూతిలో ఒకచుక్కయినా నీరు ముట్టుకునేందుకి మాకు అర్హత లేదని ఆవిడ శాసించింది. అంతే కాదు. అటువంటి ప్రమాదం తటస్థించకుండా నేము వచ్చేముందు మా చేదతాడు కనబడకుండా చేసింది. మేము కామాక్షమ్మపోరు పూర్తిగా వదలించుకోవాలని ఎలాగా తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నామో అలాగే ఆవిడకూడా మాతో పోరు పెట్టుకోవాలని తీవ్రంగా ప్రయత్నంచేస్తూంది. కామాక్షమ్మకి కారణాలు వెతుక్కోవలసిన అవసరం లేదు.

"ఈసారి మళ్లీ మా పెరట్లోకి వచ్చినట్లుగా గానీ మానూతిలో నీరు తీసినట్లుగా గానీ తెలుస్తే చాలావరకు వస్తుంది. వద్దని చెప్పాక మళ్లీ ఏపెంకితనం పెట్టుకొని నా పెరట్లో కాలు పెట్టారో? పిల్ల సంగతి మొండిగా చాలా వడిగా వుంటే, నా కంట పడితే చూపెడతాను నా తడాఖా!" అని కామాక్షమ్మ మేడమీద గరిటె కెలంచి రోడ్డుమీదకి వినపడేలా అరుస్తోంది. మా దాసీదాన్ని పిలిచి కేక లేస్తూంది. ఆమాటలలో విపరీతార్థాలు నన్ను విస్మయపరిచింది. అగ్ని ఇక్కడే ఆపకపోతే చాలా ప్రమాదం కలుగజేస్తుంది. అరితేరినఆవిడ శత్రువుగా పక్కన వుండడం పక్కలో బల్లెంలాంటిది. అందులో అమాయకురాలు మా ఆవిడ ఈవిణ్ణి ఎలా ఎదిరించగల్గుతుంది. ఈ కయ్యం ఇప్పుడే త్రుంచి వెయ్యాలి సాధువుగా అని నేనే స్వయంగా వెళ్లి కామాక్షమ్మవాళ్లకి సాష్టాంగపడి మన

(32 పేజీ చూడుడు)

## నారసింహ లేహ్యము

బంగారు చేర్చబడినది. మేహము. [illegible]
[illegible]
[illegible] సర్వప్రసాదము—
[illegible] 10 అ.

సి. వి. ఏ. & కంపెనీ.

[illegible]

## కామాక్షమ్మ!

(14-వ పేజీ తరువాయి)

స్కారం పెట్టి లేచాను. రెండు చేతులూ జోడించి ఆవిణ్ణి ప్రార్థించాను.

"మీ నూతిలో నీరు చుక్కయినా మేము తియ్యలేదు. తియ్యబోము మీతో ఎటువంటి సంబంధం మాకు లేకుండా ఉండాలనే మా ప్రయత్నం. మీరుకూడా కనికరించి మమ్మల్ని మీనోటిలో పడేసుకోక ఎలాగో బ్రతకనివ్వండి" ఈమాటలకి కామాక్షమ్మ తృప్తిపడలేదు. "నా యిల్లు ఎందుకు వదలాలి? నాకింత అగౌరవం ఆశాభంగం ఎందుకల్గించాలి? కారణం చెప్పండి? అంది.

"మీయింట్లో మాట సౌఖ్యం లేకపోవడం మాట అలాగుండగా రక్షణకూడా లేదు. అదీగాక మాకీ వాతావరణం నచ్చలేదు. మకు నచ్చిన ఇల్లు దారికి మేము వెళ్లిపోతే మీకెందుకు ఇంత కష్టం కల్గిందో మాకు తెలియకుండా వుంది" అని సమాధానం చెప్పి నేను బయటపడ్డాను.

నేను ఎంత విశ్వాసంతో ఈపని చేసానో అది ఆవిణ్ణి అంత గాయపరచింది. దెబ్బతిన్న పులిలాగ గాండ్రుమంటూ కామాక్షమ్మ మామీద తిరిగి దెబ్బతీసింది. నేను మళ్లీ సాయంకాలం ఇంటికి వచ్చేసరికి చాలా గందరగోళం జరిగింది. సొట్ట మాష్టారు. మా గుమ్మం ముందు పట్టీలు కొండూ చాలా దుర్భాషలు ఆడాడు. ఆసమయానికే సరిగ్గా మాయింటియజమానికూడా అక్కడ తటస్థించడం వుంచింది. అయింటికి ఈ యింటికి మధ్య నున్న దారిని మూయించడానికి కంకట్టాడు. దానితో ఆ ఇరుగుపొరుగుఇళ్ల యజమానులకు ఆదారిమీద ఎవరికి ఎంతవరకు హక్కున్నదనే విషయం గురించి తర్జనభర్జనలు జరిగాయి పరిస్థితి విషమించిపోయింది. నన్ను సాయంకాలం రాగానే తననివచ్చి చూడమని మాష్టారు చెప్పిపోయాడు. నావల్ల తప్పేమీ లేదని చెప్పడానికి నేను మాష్టారు దగ్గరికివెళ్ళాను. నన్ను చూచి మాష్టారుచాలా చల్లబడ్డారు.

"ఏమయినా మీరు మంచిచెడ్డలు తెలుసుకొని మరీ ప్రవర్తించాలి. మీరు ఎంతజాగ్రత్తగా ఉంటే అంత మంచిది!" అని హెచ్చరించాడు. పరిస్థితుల బాగా తెలిసిన మాష్టారు. కాని కామాక్షమ్మ మమ్మల్ని క్షమించేటట్టు లేదు.

"నాకు తీరని అప్రతిష్ఠ తెచ్చారు— నాయిల్లు మర్యాదస్థులు ఉండదగినది కాదన్నాడు. నా వినాశనాన్ని కోరి నాకు సాష్టాంగదండం చేసానా. వీడికి తడాఖా తెలీదు. పాతికవేలకి పరువునష్టానికి దావా తెస్తాను. కాచోంటే పది నెలనా జైల్లో కూచోబెడతాను. నాఆస్తిఅంతా ఖర్చుఅయినాసరే వీణ్ణి హతమారుస్తా" నని దీక్ష బూనిరది కామాక్షమ్మ.

నాగుపాము పగపూనివుంది. ప్రమాదం ప్రళయంతో సమానమయినది. నేను ఎంత జాగ్రత్తగా ఉంటేమాత్రం ఏం లాభం, కామాక్షమ్మ అన్నంతపనీ చేసింది. నన్ను నా కుటుంబాన్ని నిరాధారంగా నడివీధిలో పడేసింది.

భోగిపండుగ. మా 'బాబు' కి. భోగిపళ్లు పోయించి నలుగురు బంధువుల ఆశీర్వచనాలు ఇప్పిద్దామని ఊళ్లో ఉన్న మా అక్కయ్యగారింటికి వెళ్లాం. సాయంకాలం మేము ఇంటికి తిరిగివచ్చేసరికి చీకటిపడింది. బండిల్లోంచి దిగి గుమ్మంలో కాలు పెట్టగానే మా ఆవిడ అంది.

"ఇంట్లోదీపం వెలుగుతోంది, మీరు గాని వెలిగించారా? అని.

ఇంటితలుపు తాళం వేసి తెరవబోతే రాదు. లోపల గడియ బిగించి వుంది. నాయింట్లో శత్రులు నిప్పుపెట్టారు. ఈసరికి నా సర్వం నాశనమయిపోయివుంటుంది. పెరటివైపు పరుగెత్తి వెళ్లి చూస్తే పెరటి గోడకి కన్నం పెట్టివుంది. పెరటితలుపు బారుమని నోరుతెరచి ఏడుస్తూంది. ఇల్లంతా చిందరవందరగా వల్లకాడులాగుంది. నా సంపత్తు అంతా కొల్లగొట్టారు. నాయింట్లో పూచికపుల్లకూడా నిలవలేదు.

పట్టుబట్టలు, వెండిగిన్నెలు, డబ్బూదస్కం, కట్టుగుడ్డలు, బిందెచెంబూ," అన్నీ నా ఇంట్లోని నిలవలన్నీ హరించారు. నాకిక ఇల్లే అవసరం లేకుండా చేసారు.

పోలీసులకి కబురిచ్చాను. రాత్రల్లా కాపలాకాసారు. మర్నాడు ఇరుగుపొరుగు వీధ సోదా ఇళ్లు సోదా చేసారు. నూతులు చెరువులు వెదికించారు. ఎక్కడా పోయిన వస్తువుల ఆచూకీ దొరకలేదు. సోదా ఫలించలేదని ఎవరిదారిని వాళ్లు వెళ్లిపోయారు. మాస్థితి పండుగరోజుల్లో ఊరంతా మహానందంగా పిండివంటలు చేసుకొని తిని, కొత్తబట్టలు కట్టుకొని నవ్వులతో నిండివుంటే, మాకు పొయ్యికిందికి కర్రలులేక పొయ్యిమీదికి గింజలు లేక వంటచేసుకునేందుకి గిన్నెలు లేక, మార్చి కట్టుకునేందుకు గుడ్డలేక, ఇంటికే కాదు ఒంటికికూడా ఏ అపాయం ఏక్షణాన వస్తుందో అన్న భయంతో పిడికిట ప్రాణాలు పెట్టుకొని చంటివాణ్ణి పెట్టుకొని భగవంతునిమీద భారంవేసి ఒంటికాలుమీద నిలబడ్డాం.

స్పష్టంగా ఇది కామాక్షమ్మచేతిదెబ్బే కంటికి కనిపిస్తూంది. ఆ ఉదయమే ఇంటికి సున్నం వేసిన ఆవిడఅడుగుజాడలు మా యింట్లో రాక్షసిపాదచిహ్నాలలాగ కనిపిస్తున్నాయి. మాయింటిమర్మము అయువుపట్టు కామాక్షమ్మకి తప్ప ఇంకెవరికీ తెలీదు. అయితే ఏం లాభం; ఆ రెండు అంతస్తుల మేడమూసి భయపడే ప్రజల్లాగ పోలీసులూ జంకారు.

నాకు తెలుసు ఆ యిల్లు వెతికిస్తే పోయిన వస్తువులు పూచుపుల్లసహితంగా దొరుకుతాయని. కాని నా సాహసం చచ్చింది. దెబ్బతిని లేవలేని సింహంలాగ నిశ్వసిస్తూంది. నోరెత్తలేకపోయాను. తల వంచుకున్నాను, "కామాక్షమ్మా ఘటికురాలవు!"

ఇలా గెందరెందురి కోపంలో కూల్చి కామాక్షమ్మ ఆ రెండుఅంతస్తులుమేడ, ఇంకా మరికొన్ని ఇళ్లు కట్టింది. భూమీ, పుట్రా కొనింది. తనఆస్తి పెంచింది. ఇది ఇలా పెరిగిపెరిగి పాపం బద్దలయినప్పుడు ఒక్కమారు దగ్ధమయినప్పుడు తెలుస్తుంది. ఇన్నాళ్లగా చేసిన పాపము, ఎంత ప్రయోజనం లేనిదో. అప్పుడు కలిగే పశ్చాత్తాపానికి అంతువుండదు. అయితే అదేదో మనకు పైన భగవంతుడు చెయ్యవలసిన పని. నా మట్టుకు మాత్రం కామాక్షమ్మపేరు వింటే గుండె గడగడలాడుతుంది, ఆడది సాహసిస్తే ఎంతపనయినా చేస్తుంది. ఆభాగ్యమందు పురుషుని ప్రతాపం గడ్డిపోచకన్న పనికిమాలినది. నాస్థితి అంతే అయింది.

---

వ్యవధి లేదు. ముందుబయటపడాలి. గభీమని లేచి పరుగెత్తాను. ఇంతలోనే ఆ అలికిడి విని, అందరూ లేచారు. నేను పరుగెత్తిపోతుంటే ఒకడు నన్ను పట్టుకున్నాడు. నేను ఇంతదూరమూ వచ్చి, చివరకు వీళ్ళ చేతులలో చిక్కేను.